# 12

# మాయాజాలం

రాత్రి పదిగంటల సమయం. హౌసింగ్ బోర్డు కాలనీలో సాయంకాలం ఆరుగంటల నుండే నిర్జనంగా, నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఆ మాట కొస్తే ఉదయం పదిగంటల నుండి సాయంత్రం నాలుగుదాకా సందడి ఉండదు. మొగుళ్ళని ఆఫీసుకీ, పిల్లలని స్కూలుకీ పంపేసి ఇల్లాళ్ళు టీవీల ముందు సుఖాశీనులయ్యే సమయం అది.

ఇక సంధ్యవేళలో ఆఫీసు నుండి అలసిపోయి వచ్చిన మొగుళ్ళకి ఇన్ని కాఫీ నీళ్ళతోపాటు బొరుగులో, అటుకులో కాసిని తాయిలంలా ఇచ్చేసి టీవీలో ఖాళీ దొరికినప్పుడు రాత్రికి అన్నం వండేసిన ఇల్లాళ్లు రాత్రి ఏడుగంటల నుండి మొదలయ్యే తమ అభిమాన సీరియల్స్‌లో ఏ కొంచెం కూడా మిస్ కాకూడదన్న ఆదుర్దాతో మళ్ళీ టివీలకు అతుక్కుపోతారు. తల్లులతోపాటు పిల్లలూ అక్కడే మకాం వేస్తారు.

సరే మాట్లాడిద్దామన్నా పలికే మూడ్‌లో లేని భార్యామణుల టీవీ జాడ్యానికి మందు కనుక్కోలేని మగవాళ్ళు పేరుకి ఒక పుస్తకమో, పేపరో పట్టుకుని తాము కూడా బుల్లి తెరకే కళ్ళప్పగించేస్తారు. అదిగో అలాంటి ప్రశాంతమైన ఆ కాలనీలో ఆ రోజు రాత్రి పదిన్నర అవుతుండగా సారంగపాణిగారి మేడమీది వాటాలో నుండి పెద్దగా పాట మొదలయింది 'కట్టుకో తెల్లచీర... పెట్టుకో మల్లెపూలు' అంటూ. వాటితోపాటు ధనధనమని ఎగురుతున్న అడుగుల చప్పుళ్ళతో పైకప్పు అదిరిపోవడం మొదలయింది.

దేవుడికి దండం పెట్టుకుని పడుకోవడానికి సన్నద్ధమైన సారంగపాణి - సంజీవి దంపతులు ఈ శబ్దానికి ఉలిక్కిపడి లేచి 'ఇదేమి ఉత్పాతం?' అన్నట్లు ఒకరినొకరు చూసుకున్నారు.

సంగతేమిటో కనుక్కుందామన్నట్లు తలుపులు తీసుకుని బయట వరండాలోకి వచ్చారు ఇద్దరూ. అప్పటికే పక్కన ఇంట్లో వుంటున్న సారంగపాణి తమ్ముడు వినాయకరావు అతని భార్య వినీత బయటకు వచ్చి మెడలు పైకెత్తి మేడమీది వాటా వైపుకు చూస్తున్నారు.

సారంగపాణి, వినాయకరావులు అన్నదమ్ములు, సంజీవి, వినీతలు అక్కాచెల్లెళ్లు. పిల్లలు పెద్దవాళ్ళై ఎవరిదారిన వాళ్ళు దేశాలు పట్టిపోయాక (విదేశాల్లో ఉద్యోగాల్లో సెటిలయ్యాక) అన్నదమ్ములిద్దరూ ఒకరికొకరు తోడుగా ఉండాలని తమ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ డబ్బుతో ఆ స్థలం కొనుక్కుని పక్కపక్కనే ఇళ్లు కట్టుకున్నారు.

ఇద్దరూ కూడా తమ మేడమీది వాటాలను అద్దెకు ఇచ్చేసారు. తమకు వచ్చే పెన్షన్‌కి ఆ అద్దె డబ్బులు కలుపుకుంటే ఎవరిమీద ఆధారపడకుండా జీవితం గడిచిపోతుందని స్థిమితపడ్డారు. అద్దెకు వచ్చిన వాళ్ళు నెమ్మదస్తులు, మర్యాద మన్నన ఉన్నవాళ్లు అని రూఢి చేసుకున్నాకే ఇల్లు అద్దెకిచ్చారు.

సారంగపాణి గారి మేడమీద అద్దెకు ఉంటున్న స్వాతి, సందీప్ లిద్దరూ ఉద్యోగస్థులు. వాళ్ళకి ఒక కూతురు, కొడుకు ఉన్నారు. పిల్లల్ని స్కూలుకు పంపించి ఆఫీసుకి వెళ్తారువాళ్లు. సాయంత్రం పిల్లల్నితీసుకుని ఇంటికివచ్చాక కూడా వాళ్ల అలికిడి పెద్దగా ఉండదు. స్వాతి, సందీప్ దంపతుల వయసు నలభై అయిదు ఏళ్ళపైనే వుంటుంది.

వాళ్ళు ఆ ఇంట్లో చేరి పది నెలలు కావస్తోంది. ఇన్నాళ్లు వాళ్లతో ఏ రకమైన ఇబ్బందీ లేకుండా సాఫీగా గడిచింది. ఉన్నట్టుండి ఈ అర్ధరాత్రి మద్దెల దరువు సామెతకు సరిపోయే పాటలా గంతులూ ఏమిటో సారంగపాణి, సంజీవి జంటలకు అర్థం కాలేదు.

"నేను వెళ్ళి విషయమేమిటో చూసొస్తానుండండి" అంటూ సంజీవి నెమ్మదిగా మేడ మెట్లు ఎక్కి పై వాటా వాళ్ల కిటికీలో నుండి తొంగి చూసింది.

అక్కడ జరుగుతున్న తతంగం చూసి ఆవిడకు బుర్ర పనిచేయడం మానేసింది. సినిమా పాటల డివిడి పెట్టుకుని టీవీలో వస్తున్న ఆ పాటకి హీరో హీరోయిన్లు ఎలా గెంతుతున్నారో తామూ అలాగే అడుగులు వేయడానికి ప్రయత్నిస్తున్నారు స్వాతి, సందీప్‌లు. ఇక చూడలేనట్లుగా వెనక్కి తిరిగి మెట్లు దిగుతున్న సంజీవి పక్కింటి, ఎదురింటివాళ్ళు తమ ఇంటివైపే చూస్తూ ఉండడం గమనించి అవమానంతో తల వంచుకుని వచ్చేసింది.

తన కోసమే ఎదురుచూస్తున్న భర్తనీ, చెల్లెల్నీ మరిదినీ చూడగానే ఆవిడ ఉక్రోషం బయటపడింది.

"మంచీ మర్యాద తెలిసిన వాళ్లలా ఉన్నారని, చదువుకుని ఉద్యోగం చేస్తున్న సంస్కారవంతులని ఇల్లు అద్దెకు ఇస్తే వీళ్లకేం పోయేకాలమండి సినిమా పాటలు పెట్టుకుని డాన్సులు నేర్చుకుంటున్నారు. అవ్వ.... నలభై అయిదేళ్లు మీదపడి ఇంత పొట్ట, ఇంత నడ్డీ పెరిగాక అసహ్యంగా ఆ కులుకులేమిటి.... గంతులేమిటీ?" అంటూ విసుక్కుంది.

"అందరూ మన ఇంటివైపే చూస్తున్నారు. లోపలికి పదండి" అంది వినీత వినాయకరావుతో. పదకొండున్నర దాకా సాగిన ఆ గానాబజానా కార్యక్రమం ముగిసాక గుండె దడ తగ్గి నిద్ర పట్టింది కింద ఇంట్లో వున్న ఇంటివాళ్ళకు.

* * *

మర్నాడు ఉదయం ఎప్పట్లాగే చడీ చప్పుడు లేకుండా పనులు చక్కబెట్టుకుని ఆఫీసుకు వెళ్ళిపోయారు స్వాతి సందీప్ జంట.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలు అయ్యాక రోజులాగే కాసేపు కునుకు తీద్దామని నడుము వాల్చిన వినాయకరావు, వినీత దంపతులు తమ మేడమీద వాటా నుండి పెద్దగా అరుపులు, కేకలు వినబడి తలుపులు తీసుకుని బయటి వరండాలోకి వచ్చారు. వాళ్ళ మేడమీద అద్దెకుంటున్న రామారావు, సునీత ఒకరి తంటాకు రాకుండా గుట్టుగా బ్రతికే దంపతులు. సునీత ఉద్యోగం చేయదు. ఇంట్లో రామారావు తల్లి కూడ వుంటోంది. సునీతకు ఒకత్తే ఆడపిల్ల. మగపిల్లలు లేరు. ఆవిడ గొంతు ఎప్పుడూ పెద్దగా వినబడదు.

అలా ఎంతో ఒద్దిగ్గా కనిపించే సునీత ఇవాళ గయ్యాళి గంపలా అరుస్తున్నది.

"వంశోద్ధారకుడైన మనవడిని కనలేదని నన్ను దెప్పుతారెందుకు? ఆ మాట మీ కొడుకునే అడగండి. పెద్దవారుకదాని మర్యాద ఇస్తుంటే సణుగుడు ఎక్కువయ్యింది" అంటూ.

"నా కొడుకును అంటావెందుకు? మా వంశంలో అందరికీ మగబిడ్డలున్నారు. ఆడపిల్లలనే కనే లక్షణం మీ పుట్టింటి నుండి వచ్చిందే" పెద్దగా గదమాయించింది అత్తగారు జానకమ్మ.

"అదిగో ఆమాటే వద్దన్నది. మా పుట్టింటి వాళ్ళగురించి మాట్లాడితే ఊరుకునేది లేదు. ఇక్కడ ఉండడం మీకు కష్టంగాఉంటే ఎక్కడకుపోతారో పోండి" ఉక్రోషంగా అంది సునీత.

"ఊరుకోకుండా ఏం చేస్తావేం? ఎక్కడికో పోవడానికి నాకేం ఖర్మ? నిన్నే పుట్టింటికి తోలేస్తాను. నా కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేస్తాను. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో" జానకమ్మ గొంతు పెంచింది.

"రెండో పెళ్ళి చేస్తారేం? అదీ చూస్తాను. కట్నం కోసం కాల్చుకు తింటున్నారని పోలీసులకు ఒక్క ఫిర్యాదు ఇచ్చానో అమ్మాకొడుకూ ఇద్దరూ జైల్లో కూర్చుంటారు. అనవసరంగా నన్ను రెచ్చగొట్టకండి". అత్తగార్ని మించి దులిపేస్తోంది సునీత.

ఇదంతా వింటున్న వినాయకరావు, వినీతలకు మతిపోయింది. అప్పుడే అక్కడికి వచ్చిన సారంగపాణి" ఏమయింది వీళ్లకి? అలగా జనంలా అరుచుకుంటున్నారు?" అన్నాడు.

"అందరూ మన ఇంటివైపే చూస్తున్నారు. లోపలికి పదండి" అంది సంజీవి చుట్టూచూసి.

ఆ రోజు రాత్రి పదిన్నరకు సారంగపాణి ఇంట్లో అద్దెకు దిగిన స్వాతి, సందీప్‌ల గానాబజానా మళ్ళీ మొదలయింది. అయితే పాట కొత్తది. ' దాయి దాయి దామ్మా... నడిచే కుందనాల బొమ్మా" అంటూ కొత్తపాటా, తదనుగుణంగా ఇంటికప్పు కూలిపోతుందేమో అన్నట్లుగా దంపతులిద్దరూ వేస్తున్న గంతులు ... గంటసేపు సాగింది.

మర్నాడు మధ్యాహ్నం వినాయకరావు ఇంట్లో అద్దెకు ఉంటున్న రామారావు

భార్య సునీత, ఆవిడ అత్తగారు జానకమ్మల పోట్లాట మళ్ళీ మొదలయింది అయితే టాపిక్ మారింది.

"ఆస్తి అంతా కూతురికి దోచిపెడుతున్నారు" అని సునీత అరుపులు.

నా ఇష్టం నా ఆస్తి ... ఏం చేస్తావే. మీపుట్టింటి వాళ్ళకుమల్లే పిల్ల పెళ్లి చేసి చేతులు దులిపేసుకుని మళ్ళీ జాకెట్టు ముక్కయినా పెట్టని వంశం కాదు మాది" అని జానకమ్మ కేకలు సాగాయి. ఇన్నాళ్లూ ఏ తగవూ, తంటా లేకుండా ఉన్నవాళ్ళని పట్టుకుని "ఇదేం పనికి మాలిన వ్యవహారం?" అని దులిపేయలేక కొన్ని రోజులు ఊరుకున్నారు సారంగపాణి, వినాయకరావులు.

ఇలా పదిరోజులు సాగేసరికి వాళ్లకి ఓపిక నశించిపోయింది. ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు పదకొండు నెలల వరకే ఇచ్చినట్లు నెలరోజుల నోటీసుతో వాళ్ళు ఖాళీ చేయాల్సి ఉంటుందని రాతపూర్వకంగా హామీ తీసుకుని తాళాలు అప్పగించారు కనుక వాళ్ళతో పోట్లాటలు పెట్టుకోకుండా 'మా పిల్లలు వచ్చేస్తున్నారు. కనుక మాకే ఇల్లు కావాలి. ఖాళీ చేయమని' అద్దెకున్నవాళ్ళకి చెప్పేసారు అన్నదమ్ములు.

"అదేంటి మాస్టారూ... మీ ఇల్లు మాకెంతో కలిసి వచ్చిందని మేము పొంగి పోతుంటే ఖాళీ చేయమంటున్నారు" అంటూ బాధపడ్డాడు సందీప్.

"అవును పిన్నిగారూ... మీ ఇల్లు మాకు నిజంగా అదృష్టం తెచ్చింది. లేక పోతే వేలమంది ప్రయత్నిస్తున్న 'భార్య పాట, భర్త ఆట' లో పాల్గొనే లక్కీఛాన్స్ మాకు వచ్చింది. ఆ ఛానెల్ వాళ్ళ దగ్గరనుండి ఉత్తరం వచ్చిన రోజు నుండి రోజూ రాత్రిళ్లు ఎంత అలసిపోయి ఉన్నా డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నాం. అసలు మిమ్మల్ని కూడ మాతోపాటు ఆడియన్స్‌గా తీసుకెళ్లాలనుకున్నాం" బాధపడింది స్వాతి. వినాయకరావు మేడమీద అద్దెకుంటున్న రామారావు సునీతలు కూడ ఇల్లు ఖాళీ చేయమంటే దిగులుపడ్డారు.

"ఇలా హఠాత్తుగా మీ పిల్లలు రావడం మీకు సంతోషమే గానీ మాకు గండంగా మారింది. మీ ఇంటి వాస్తు మహిమ ఏమిటో సార్... ఎంతో మంది నెలల తరబడి ప్రయత్నించినా రాని అవకాశం 'మీ ఇంటి పోట్లాట మాకు నవ్వులాట' ప్రోగ్రామ్‌లో పాల్గొనే అదృష్టం మా ఆవిడ సునీతకూ, మా అమ్మగారికి దక్కింది. అందుకే వాళ్ళు పదిరోజులుగా మధ్యాహ్నం పూట రకరకాల టాపిక్‌ల మీద పోట్లాడుకోవడం ప్రాక్టీస్ చేస్తున్నారు. మేము ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినా మా ప్రోగ్రాంకి మీరు తప్పకుండా రావాలి" అన్నాడు రామారావు.

* * *

వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్న రోజున వినీత, సంజీవి ముఖాలలో 'పొరపాటు చేసామా' అన్న భావం మెదిలింది. వాళ్లిద్దరికీ పక్కపక్క అపార్ట్‌మెంట్స్ దొరికాయట. నెల్లాళ్ల తరువాత ఒకరోజు రామాలయంలో సంజీవి, వినీతలను కలిసారు స్వాతి, సునీతలు, అనుకోకుండా ఆత్మీయులను కలుసుకున్నట్లు సంతోషపడ్డారు. కష్టసుఖాలు చెప్పుకున్నారు.

అయితే కొత్తగా తమ మేడమీద అద్దెకు దిగిన వాళ్ళ ఆరేళ్ళపాప 'చిందు

మీది – సిరి మాది' టీవీ కార్యక్రమంలో పాల్గొనే ఛాన్స్ వచ్చి 'అ అంటే అమలాపురం, ఇ అంటే ఇచ్ఛాపురం' డాన్సు ప్రాక్టీసు చేస్తున్నదని మాత్రం సంజీవి, స్వాతికి చెప్పలేదు. అలాగే తమ మేడమీది వాటాలో దిగిన దంపతులు ఇరవై ఏళ్ల కొడుకు 'బ్యాంగ్ – బ్యాంగ్'... డాన్సు పోటీకి ఎంపికై తన క్లాస్‌మేట్ ఒక అమ్మాయితో కలసి 'నడక కలిసిన నవరాత్రి, సిగ్గుపడితే శివరాత్రి' పాటకు డాన్స్ సాధన చేస్తున్నట్లు వినీత కూడా సునీతకు చెప్పలేదు.

"మేము కొత్తగా చేరిన అపార్ట్‌మెంట్ మాకు కలసిరాలేదు పిన్నిగారూ ! అంత మంచి అవకాశం వచ్చినట్లే వచ్చి జారిపోయింది. కారణాంతరాల వల్ల ఆ చానెల్ వాళ్ళు 'భార్యపాట – భర్త ఆట' ప్రోగ్రాం మానేసారుట. దానికి బదులుగా 'అత్తసవాలు – అల్లుడు జవాబు' ప్రోగ్రాం పెట్టారుట దానికోసం ఈసారి మా అమ్మా, మావారూ ప్రయత్నిస్తున్నారు ముందుగానే జూ.ఎన్టీఆర్, రమ్యకృష్ణల డాన్స్‌ప్రాక్టీసు కూడా మొదలు పెట్టారు" అంది స్వాతి.

"మరేనండీ.... మాకు 'మీ ఇంటి పోట్లాట – మాకు నవ్వులాట' లో ఛాన్స్ మిస్ అయిపోయింది. ఎంచేతో ఆ కార్యక్రమం రద్దు చేసారుట. దానికి బదులుగా తల్లీకూతుళ్ళకు 'నువ్వా నేనా?' అనే వంటల ప్రోగ్రాం పెట్టారుట. దానికోసం నేను శర్వాణి ప్రయత్నిస్తున్నాం" అంది సునీత.

"అయ్యో" అంటూ బాధపడ్డారు సంజీవి, వినీతలు.

"అన్నట్లు చెప్పడం మరచిపోయాను పిన్నిగారూ – మీకు గోల్డన్ ఛాన్స్ – షష్టిపూర్తి చేసుకున్న దంపతులకోసం 'మళ్ళీ పెళ్ళాడుతా' అన్న ప్రోగ్రాం పెట్టారు. మీరు ఇంచక్కా పాల్గొనవచ్చును. దండలు మార్చుకుని, పేర్లు చెప్పడం లాంటి సరదాలు ఉంటాయి. అందరూ మిమ్మల్ని చూస్తారు టివీ తెరమీద" అంటూ ఉత్సాహంగా చెప్పింది స్వాతి.

"ఇదిగోండి టెలిఫోన్ నెంబర్, ఆ ఛానెల్ అడ్రస్..." అంటూ కాగితం మీద రాసిచ్చింది సునీత. ఆ కాగితం అందుకుని పదిలంగా చిన్న పర్సులో పెట్టుకుంది సంజీవి. ఇంటికి వస్తున్న సంజీవి, వినీతల ముఖంలో కొత్త ఉత్సాహం, కళ్ళల్లో కొత్త కలలు. ఆరేళ్ల పాప నుండి అరవై ఏళ్ళ ముసలివాళ్లదాకా ఆకర్షిస్తున్న టీవీ మాయాజాలం వైపు నడుస్తున్నారు వాళ్లు.

• *ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక - నవంబరు 2006* •